క్లుప్తంగా

తిరుమలకు భక్తుల పాదయాత్ర



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి మంగళవారం ఉదయం భక్తులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

తోటపల్లిగూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గడిచిన మూడు నెలల్లో మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, మరో మూడునెలలపాటు చేపట్టాల్సిన పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు.

వధూవరులకు ఆశీర్వాదం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఫయాజ్‌బాషా కుమారుడి వివాహ రిసెప్షన్‌ను పట్టణ పరిధిలోని కేజీఎస్ షాదీమంజిల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వధూవరులను మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు ప్రసన్నకుమార్‌రెడ్డి ఆశీర్వదించారు.

19న అండర్ - 14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అండర్ - 14 బాలుర క్రికెట్ జట్టును నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 19న ఎంపిక చేయనున్నామని క్రికెట్ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ సొంత కిట్‌తో వైట్ అండ్ వైట్ డ్రెస్‌తో హాజరుకావాలని కోరారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని.. సెప్టెంబర్ ఒకటి, 2011 తర్వాత జన్మించిన వారే అర్హులని చెప్పారు.

కుక్కల పట్టివేత



నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న గోవులు, కోతులు, కుక్కలను కార్పొరేషన్ సిబ్బంది పట్టుకొని గోశాల, అటవీ ప్రాంతం, ఏబీసీ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్ మాట్లాడారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, ఫతేఖాన్‌పేట, పరమేశ్వరినగర్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న 15 గోవులను పట్టుకొని కల్లూరుపల్లి గోశాలకు తరలించామని చెప్పారు. పుత్తా ఎస్టేట్స్‌లో 22 కోతులను పట్టుకొని జిల్లా సరిహద్దు సమీపంలోని బద్వేలు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టామన్నారు. నీలగిరి సంఘం, పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్ ప్రాంతాల్లో సంచరిస్తున్న 12 కుక్కలను పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి శస్త్ర చికిత్సలను చేయించామన్నారు.

నిరుపయోగంగా..

- నిమ్మ యార్డులో పదేళ్ల క్రితం రైపనింగ్ ఛాంబర్ ఏర్పాటు
- కార్బైడ్‌కు ప్రత్యామ్నాయంగా..
- వినియోగించుకోని వ్యాపారులు
- దశాబ్ద కాలంగా మూలనపడిన వైనం



యార్డులో నిరుపయోగంగా ఉన్న రైపనింగ్ ఛాంబర్



ఏర్పాటు చేసిన జనరేటర్



ఛాంబర్‌ను ప్రారంభించిన దృశ్యం (ఫైల్)

పొదలకూరు: ఉద్యాన శాఖ పర్యవేక్షణలో పొదలకూరు ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రైపనింగ్ ఛాంబర్ మూలన పడిఉంది. 2016లో దీనిని నిమ్మ వ్యాపారుల కోసం అందుబాటులోకి తెచ్చారు. అయితే వారు ఇక్కడ కాయలను మగ్గబెట్టేందుకు వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది.

ఆనాడు ఇలా..

కాయలను మగ్గ బెట్టేందుకు కార్బైడ్‌ను నిషేధించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో రైపనింగ్ ఛాంబర్ ద్వారా ఎథిలిన్ గ్యాస్‌ను వాడుకునేందుకు ఏర్పాట్లు చేశారు. మార్కెటింగ్, ఉద్యాన శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. అప్పట్లో కలిగిరిలో నిరుపయోగంగా ఉన్న రూ.20 లక్షల విలువైన రైపనింగ్ ఛాంబర్‌ను పొదలకూరుకు మర్చారు. 5 మెట్రిక్ టన్నుల కాయలను మాత్రమే మగ్గబెట్టేందుకు అవకాశం ఉండేది. శీతాకాలంలో సుమారు 72 గంటల వరకు కాయలను మగ్గబెట్టాల్సి ఉంటుంది. ఫలితంగా వ్యాపారులకు తక్కువ సామర్థ్యం ఉన్న గ్యాస్ ఛాంబర్ సరిపోయేది కాదు.

నిమ్మకు నిరుపయోగం

గుర్తింపు పొందిన ప్రభుత్వ నిమ్మ మార్కెట్ పొదలకూరులో ఉండటంతో ఇక్కడ రైపనింగ్ ఛాంబర్ ఏర్పాటు చేశారు. అయితే ఇలాంటివి నిమ్మ, మామిడి కాయలను మాగబెట్టేందుకు అంత అనుకూలం కాకపోవడంతో వ్యాపారులు ఆసక్తి చూపలేదు. దీనికితోడు తక్కువ సామర్థ్యం మాత్రమే ఉండేది. యార్డులో నిత్యం సీజన్‌తో పని లేకుండా సుమారు 100 టన్నుల కాయలు ఎగుమతి, దిగుమతి అవుతుంటాయి. ఫలితంగా 5 టన్నుల సామర్థ్యం కలిగిన ఛాంబర్లో ఎవరు కాయలను మగ్గబెట్టుకోవాలో తెలియక వ్యాపారులు దానికి దారిదాపులకు కూడా వెళ్లలేదు. సాధారణంగా రైపనింగ్ ఛాంబర్ అరటి కాయలను మాగబెట్టుందుకు చాలా అనుకూలంగా ఉంటాయని ప్రస్తుతం అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పొదలకూరు పట్టణంలో ఛాంబర్‌ను అరటి కాయలు మగబెట్టేందుకు ప్రైవేట్ వ్యక్తులు వినియోగిస్తున్నారు.

అద్దెకు ఇవ్వొచ్చు

మార్కెట్‌లో రైపనింగ్ ఛాంబర్‌ను అరటి కాయలను మగ్గబెట్టుకునేందుకు అద్దెకు ఇచ్చుకునే అవకాశం ఉంది. నిరుపయోగంగా ఉండటంతో ఉన్న ఛాంబర్, జనరేటర్, ఇతర సామగ్రి పనికిరాకుండా పోయే అవకాశం ఉంది. అయితే అరటి కాయలను నెల్లూరు నగరంలోనే మాగబెట్టడం, పొదలకూరులో ప్రైవేట్ వ్యక్తికి ఛాంబర్ సౌకర్యం ఉండటంతో మార్కెట్లో ఉన్నది మూలన పడినట్టుగా తెలుస్తోంది. అధికారులు చొరవ తీసుకుని ఉపయోగంలోకి తీసుకొస్తే ఎంతో కొంత నిధులు సమకూరే అవకాశం ఉంటుందంటున్నారు. అయితే ఏర్పాటు చేసిన ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖలు పట్టించుకోకపోవడంతో ఛాంబర్ నిరుపయోగంగా మారిపోయింది.

నిమ్మ వ్యాపారులకు పనికి రాలేదు



“రైపనింగ్ ఛాంబర్ యార్డులో నిమ్మ వ్యాపారులకు పనికిరాలేదు. కొద్దిరోజులు కాయలను మాగబెట్టేందుకు వ్యాపారులు ప్రయత్నించారు. కాయలు పాడైపోవడంతో ఎవరూ అసక్తి చూపలేదు. అరటి కాయలకు ఛాంబర్లు అనుకూలంగా ఉన్నాయి. ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తాం.

– అనితాకుమారి, మార్కెటింగ్ ఏడీ, నెల్లూరు

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ రవినాయక్



మనుబోలు : మాట్లాడుతున్న ఎస్సై

ముత్తుకూరు(పొదలకూరు): దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు పోలీసు, ఫైర్ నిబంధనలు విధిగా పాటించాలని పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ అన్నారు. ముత్తుకూరులో సీఐ మంగళవారం లైసెన్స్‌లున్న దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాపులను ఒకే సముదాయంగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నీరు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాల్సిందిగా సూచించారు. లైసెన్సులు లేని వారు టపాసులను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో పోర్టు ఎస్సై శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

మనుబోలు: దీపావళి సందర్భంగా అనుమతి లేకండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివరాకేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టపాసుల విక్రయదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ షాపులను నివాసాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో ముగ్గురికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

➡ **తోటపల్లిగూడూరు:** నరుకూరు సెంటర్, సాలిపేట్ సెంటర్, మహాలక్ష్మీపురం సెంటర్, ఇస్కపాళెం సెంటర్లలో బాణసంచా అంగళ్లకు అనుమతి లేదని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఆయా సెంటర్లకు దూరంగా



మాట్లాడుతున్న ఎస్సై వీరేంద్రబాబు

అంగళ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కోవూరు: లైసెన్స్ లేకుండా బాణసంచా దుకాణాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పెన్నా పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక, మట్టిని అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. కేసులు నమోదు చేసి, అక్రమంగా ఉపయోగించిన వాహనాలు, వాటి ద్వారా సంపాదించుకున్న ఆస్తులను సీజ్ చేస్తామని చెప్పారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.



కోవూరు: మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

వామ్మో దోమలు

- అధ్వానంగా పారిశుధ్యం



దుస్థితిలో మురుగు కాలువలు

పొదలకూరు: పట్టణంలో పగలు, రాత్రి వేళల్లో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దీంతో డెంగీ, మలేరియా జ్వరాలు వస్తాయని ప్రజలు భయపడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య లోపం వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నట్టు తెలుస్తోంది. మురుగు కాలువల్లో పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లకపోవడంతో దోమలు అదుపులోకి రావడం లేదు. ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నారే కానీ వాటి నివారణకు పంచాయతీలతో కలిసి చర్యలు సక్రమంగా చేపట్టలేకపోతున్నారనే విమర్శలున్నాయి. పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆరుబయట నిద్రించే వారు దోమతెరలు ఉపయోగించాలని ఆరోగ్య శాఖ చెబుతోంది. అయితే చాలామంది పట్టించుకోవడం లేదు. ఫాగింగ్ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాహనం ఢీకొని పెయింటర్‌కు గాయాలు



కోవూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన పట్టణంలోని లారీ యార్డు సమీపంలో గల రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరు నుంచి రాజుపాళెం వైపు మోపెడ్‌పై పెయింటర్ శ్యామ్ బయల్దేరారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆయన చెట్ల మధ్యలో పడిపోయారు. అటుగా వెళ్తున్న ఓ ఆటోడ్రైవర్.. మోపెడ్‌ను గమనించి పరిసరాలను పరిశీలించగా చెట్ల మధ్యలో తీవ్ర గాయాలతో పడి ఉన్న శ్యామ్‌ను గుర్తించాడు. వెంటనే 108కు సమాచారమివ్వగా, వారొచ్చి కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడ్ని ఇందుకూరుపేట మండలం గంగపట్నం వాసిగా స్థానికులు గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బహుమతుల ప్రదానం



పొదలకూరు: స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని విద్యార్థులతో చదివించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి ఎస్సై హనీఫ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మస్తాన్ బాబు, మల్లికార్జున్ నాయుడు, ప్రిన్సిపల్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, ఎ.చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన నేతలు



కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జగ్జీవన్‌రావు, వెంకటేష్, మనోహర్, శేషు, సుధాకర్ తదితరులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, పార్టీ కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, కవరగిరి ప్రసాద్, జానా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలోపు నిర్మాణ పనులు పూర్తి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 24వ డివిజన్ పరిధిలో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోపు నాణ్యతతో పూర్తి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. డివిజన్లోని కల్లూరుపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీలంక కాలనీ, ఆర్డీటీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గొలగమూడి రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆర్డీటీ కాలనీలో సీసీ రోడ్లు, కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను కల్పించాలని స్థానికులు కోరగా, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ నిర్వాహకులను సంప్రదించి.. భాగస్వాములయ్యేలా ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలో కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్పొరేటర్ అరవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

➡ పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ విభాగంతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన వసూళ్ల లక్ష్యాలను సాధించాలని అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో వాసుబాబు, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కోవూరు: పట్టణంలోని టీఎంసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పూర్ణప్రకాష్ అండర్ – 19 బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. నెల్లూరులో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో విద్యార్థిని ప్రిన్సిపల్ సికిందర్ మంగళవారం అభినందించారు. ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాసులుకు అభినందనలను తెలియజేశారు.

అంగన్‌వాడీల్లో బాలికా దినోత్సవం



పొదలకూరు : బాలికా దినోత్సవ ర్యాలీ



పొదలకూరు : పౌష్టికాహారం అందజేస్తున్న సూపర్‌వైజర్

పొదలకూరు: పట్టణంలోని నర్సారెడ్డి కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, ఎంఎస్‌కే సీహెచ్ రూప, కార్యకర్తలు లక్ష్మి, రత్నమ్మ, మణెమ్మ, కుమారి, రమాదేవి, అమరావతి పాల్గొన్నారు.

➡ మండలంలోని మహ్మదాపురం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం అందించే విధానం గురించి తల్లులకు వివరించారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు



కోవూరు: జీవన ఎరువులపై రైతులు అవగాహన పెంచుకోవాలని పలువురు సూచించారు. జీవన ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని పాటూరులో కేవీకే నెల్లూరు సమన్వయకర్త లలితా శివజ్యోతి అధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన సుమతి మాట్లాడారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించొచ్చని చెప్పారు. కోవూరు మండల సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, మండల వ్యవసాయాధికారి రజని, కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన



కొడవలూరు: గండవరంలో అవగాహన ర్యాలీ



కొడవలూరు: పాతూరులో..

కొడవలూరు: బిడ్డకు ఆర్నెల్లు వచ్చేంత వరకు తల్లి పాలనే పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ సూచించారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పిల్లలకివ్వాల్సిన పౌష్టికాహారంపై మండలంలోని గండవరంలో గల గాడికయ్యలు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీని జరిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షంషాద్, రాజేశ్వరి, మమత, ప్రియదర్శిని, హెల్పర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

➡ రామన్నపాళెంలోని పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజన, రోజా, పావని, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి



కొడవలూరు: మాట్లాడుతున్న సుబ్బారావు



కొడవలూరు: హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

కొడవలూరు: ప్రభుత్వమిచ్చే నిధులతో సరిపుచ్చుకోకుండా ఆర్థిక వనరులను పంచాయతీలు సొంతంగా సమకూర్చుకోవాలని ఎంపీడీఓ వెంకటసుబ్బారావు సూచించారు. ఆర్థిక వనరులను సొంతంగా సమకూర్చుకోవడంపై అనే అంశంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో పార్కింగ్‌లను ఏర్పాటు చేసి రుసుములు వసూలు చేయడం.. చేపల చెరువులను వేలమేయడం.. కూడళ్లలో గదులు నిర్మించి అద్దెకివ్వడం తదితరాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రెయినర్లు శ్రీకాంత్, మోహనకృష్ణ అవగాహన కల్పించారు. కార్యాలయ సూపరింటెండెంట్ రామ్‌ప్రసాద్, సర్పంచ్ బుజ్జిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్యామ్‌సుందర్, సురేష్‌కుమార్, బ్రహ్మానందరెడ్డి, సీనియర్ సహాయకుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ

పొదలకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని సర్పంచ్‌లకు శిక్షణా శిబిరాన్ని మంగళవారం ఎంపీడీఓ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం కూడా శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచ్‌లు పంచాయతీల్లో స్వయం సమృద్ధి సాధించుకోవాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం నుంచి నిధులు అందుతాయని ఎదురు చూడకుండా చేపల చెరువులు, కంపకర్ర, ఇంటి పన్నులు, ఇతర వనరులను సద్వినియోగం చేసుకుని నిధులు సమకూర్చుకోవాల్సిందిగా పేర్కొన్నారు. చెత్త నుంచి సంపద ద్వారా కూడా పంచాయతీలకు నిధులు సమకూరే అవకాశం ఉందన్నారు.

స్వయం సమృద్ధి సాధించాలి

ముత్తుకూరు(పొదలకూరు): పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించి నిధులు సమకూర్చుకోవాల్సిందిగా ఎంపీడీఓ నాగమణి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ గండవరపు సుగుణ ప్రారంభించారు.

➡ **మనుబోలు:** పంచాయతీలు సొంతంగా ఆదాయం సమకూర్చుకునేలా వనరులను అన్వేషించాలని ఎంపీడీఓ జలజాక్షి సూచించారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఇంటి పన్నుల వసూళ్లతోపాటు ఇతర ఆదాయవనరులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్పీలు హరిప్రసాద్‌రెడ్డి, జయంతి మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ గరుడయ్య, ఏఓ ముజీబున్నీసా తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో..

అభ్యంతరాలను తెలపండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇస్కపాళెంలో మూడు.. పవ్వేరులో ఒక లేఅవుట్‌కు మున్సిపాల్టీ ఆమోదం తెలిపిందని కమిషనర్ బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి సంబంధించిన వివరాలను మున్సిపల్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఉంచామని, అభ్యంతరాలను 15 రోజుల్లో తెలియజేయాలని సూచించారు.